


ఐ లవ్, ఉయ్ లవ్, హి లవ్స్ మి యు లవ్ మి ఐ లవ్ యు - కవిత టైప్ కొట్టిపారేస్తోంది. ఆమె వ్రేళ్లు చకచకా పనిచేస్తున్నాయి. మహావిద్వాంసుడు తన వీణలో లీనమైపోయినట్లు ఆమె అంత దీక్షగా టైప్ చేస్తోంది. నాలుగైదులైన్లు కొట్టి రెండుచేతులు పైకెత్తింది. ఇన్‌స్ట్రక్టర్ రావటంతో నమస్కరించి లేచింది.

"ఏమ్మా చాలా హుషారుగా ఉన్నావు ?"

"నేను పాసయ్యానండీ-అందుకని."

"గుడ్. కంగ్రాట్స్...ఏమిటి టైప్ చేస్తున్నావు?" అంటూ మెషీనుపైన కనబడుతున్న పేపర్‌ని చూశాడు...

"అబ్బో ! లవ్‌మీద వ్యాసమా ?"

కవిత సిగ్గుపడింది ... "వ్యాసం కాదండీ...సంతోషం...అందుకని ... ఆకయ్యను కౌగిలించుకుని ఐ లవ్ యు అంటూ ఇటొచ్చాను. మీరు లేరు. అదే కొడ్తూ కూర్చున్నాను..."

"మంచి పన్జేశావు లవ్ - ప్రేమ - అనేది ఒక మంత్రం తల్లీ. దాన్ని ఆ యంత్రంలో పెట్టేశావు. ఇకనేం ఫరవా లేదు. బి ఎ. డిగ్రీ చేతికొచ్చింది. బి.ఎ డిగ్రీ - టైప్ - షార్ట్‌హాండ్ అండ్ 'లా' లతో ఉద్యోగం చెయ్యి. నాన్నగారి కూతురివనిపించుకో."

"థాంక్సండీ" అని చేతులు జోడిస్తుంటే కళ్లు చెమ్మగిల్లాయి.

ఇంటికి రాగానే తల్లి వడ్డించింది. ఆ పూట సావధానంగా భోంచేసింది. తల్లి కూతురి ముఖంలో ఆనందాన్ని చూసింది. దాన్ని చూడటానికి భర్త లేడే అని బాధపడింది

"అమ్మా ! ఈవేళ్టికి ఒదిలెయ్. రేపటి నించి పనికోసం తిరగటం ప్రారంభిస్తాను, సరేనా ?"

"అక్కర్లేదమ్మా" అంది నవ్వేస్తూ.

"అదేమిటి! నేను పని చెయ్యొద్దా?" విస్తుపోయింది కవిత. ఆమె జవాబు చెప్పకుండా వెళ్ళిపోయింది. మూలనున్న పెట్టెలు దించి అట్టడుగు పెట్టెలో ఉన్న ఒక కవరు తీసుకొచ్చి కవిత చేతిలో పెట్టింది. "దీని అవసరం మీ అన్నకు తగల్లేదు. ఈ అడ్రసుకు వెళ్ళి ఆ కంపెనీ యజమాని వీరప్రసాద రావుగారికి చూపిస్తే – ఒకవేళ ఉద్యోగం దొరకవచ్చు. ఏనాడో మీ నాన్నగారు ఇచ్చారు మీ నాన్నగారు బ్రతికుండగా దీని అవసరం రాలేదమ్మా. నీ కోసమైనా పనికివస్తుందేమోనని ఉంచమన్నారు.

దాన్ని అందుకుంది. "ఏముంది దీన్లో ?" ఆశ్చర్యంగా అడిగింది.

"తెలీదు. మీ నాన్నగారు చెప్ప లేదు" అని చిన్న అబద్ధమాడింది.

స్వింగ్‌డోర్ చప్పుడుచేయకుండా తెరచుకుంది.

ఫ్యాన్ విసీవినబడనట్లుగా అన్నాడు "లోపలి కెళ్ళమ్మా" అని.

కవిత లోపలి కెళ్ళింది.

విశాలమైన ఆ గదిలో అన్నీ ఖరీదైన వస్తువులే ఉన్నాయి. ఒక మూలలో పెద్ద సేఫ్ ఉంది.

టేబిల్‌ముందు ఒత్తుగా ఫోమ్ కుషన్స్ వేసిన చెయిర్స్ నాలుగైదు ఉన్నాయి. ఆవలివైపు ఒక రివాల్వింగ్ చెయిర్ ఉంది. దానిలో ఎవ్వరూలేరు. కవిత తన బాగ్‌ను హృదయానికి అదిమిపట్టి చుట్టూరా గమనించి చూస్తోంది.

ఒకవైపు గోడకు పెద్ద పెయింటింగ్ వ్రేలాడుతోంది. ఆమె దాన్ని సమీపించి పరీక్షగా చూస్తోంది. అది బ్రష్‌తో వేసినది కాదు. స్కాల్‌పల్‌తో వేసినది. దగ్గరగా చూస్తే అంతా రంగు రంగు ముద్దలే. కాని కాస్త ఎడంగా నుంచుని చూస్తే... అబ్బ... అంతా తడి తడి... గొడుగులమీద నీటిబిందువులు... నేల మీద పలుచగా జారుతున్న నీరు ! చూస్తే అంతా తేమ తేమగా ఉంది. వేసవిలో దీనిదగ్గర నుంచుంటే ఎంత హాయి ! ఆమె దగ్గరగా వెళ్ళి చూచింది. 'మాలిన్ రూ' అని ఉంది "అది పారిస్‌లో ఒక షాపింగ్ సెంటర్ దృశ్యం." ఓ పురుషకంఠంవినవచ్చింది.

ఆమె చటుక్కున తిరిగింది. అతడు రివాల్వింగ్ చెయిర్‌లో కూర్చుంటున్నాడు

తనుక అతడు బాస్ అన్నమాట.

ఆమె వెంటనే నమస్కరించింది.

అతడు తల ఆడిస్తూ ఆమెను గమనించాడు.

ఆమెది చాలా ఆకర్షణీయమైన ముఖం, ఆమె ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ముస్తాబు చేసుకోలేదు. కాని వెంట్రుకల్ని మెలిపెట్టి తలమీద ఎత్తుగా వేసుకున్న ముడి ఆమెను క్లాసిక్ బ్యూటీగా మార్చి వేసింది. ఒత్తుగాఉన్న కనురెప్పల మాటున ఉన్న కళ్ళు అతి చురుకుగ ఉన్నట్లు కనబడుతున్నాయి.

"కూర్చోండి" అన్నాడు ... ఈమె ఎవరు? ఎందుకు వచ్చింది?

ఆమె కూర్చుంది. బాగ్ తెరిచి ఒక పొడవైన కవర్ తీసింది.

"సర్...పనికోసం వచ్చాను.

"ఖాళీలు లేవని మీకు ఎవరూ చెప్పలేదా? బయట బోర్డు చూడలేదా?" సీరియస్‌గా అన్నాడు

"చూడలేదు. ఒకవేళ చూచినా - ఓ మాటు మిమ్మల్ని కలుసుకోవాలనే వచ్చేదాన్ని."

"ఓ...మిమ్మల్ని చూచినా ఖాళీలు లేవనే చెప్పగలను."

కవిత కళ్ళలో తీక్షణత చోటుచేసు కున్నది. కళ్లు రెపరెపలాడించి ముఖం త్రిప్పుకుంది

ఆమె ఉద్వేగాన్ని అణచుకుంటున్న దానికి చిహ్నంగా హృదయం త్వరితంగా లేస్తూ పడ్తూ వుంది.

ఆ తరువాత శాంతంగా అంది. "ఆ ఉద్దేశంతో రాలేదు. దయచేసి ఎదుటి వ్యక్తిని గూర్చి అంత చులకనగా భావించకండి. అంత తప్పు అంచనా కూడా వేయకండి."

ఎవరీమె! తనతో అంత ధైర్యంగా మాట్లాడుతోంది! "చూడండి నాది ప్రెషన్ టైం. ఎందుకొచ్చారో..."

"సర్...టైం ప్రెషన్ కానిదెవరికి? మీకు విజయశేఖరంగారు తెలుసను కుంటాను?" కవిత ఆగింది...

"విజయశేఖరంగారంటే ఇక్కడ పి.ఎ.గా పనిచేస్తూ హార్ట్ ఎటాక్..."

"ఆ...ఆ...వారేనండి...వారు మా తండ్రిగారు."

"ఓ...అయామ్ సారీ...ఇక్కడ ఇరవై అయిదు సంవత్సరాలు పనిచేశా రట...పాపం...ఏమైనా కంపెనీవాళ్ళు డబ్బు ఇవ్వాల్సి ఉందా?"

"అదేంలేదు. అంతా ఇచ్చేశారు.''

"అవుతే!"

నాన్నగారు బ్రతికుండగా ఆతని కోసం చేసిన ఖర్చుకంటే ఆయన పోయిన తరువాత చేసిన ఖర్చు ఎక్కువే అయింది. అమ్మను ఆ సమయంలో ఆపలేకపోయాము. అన్నయ్య అన్నీ జరిపించి - మిగిలిన రెండు వేలు తీసుకెళ్ళిపోయాడు గుంటూరులో

ఉద్యోగం చేస్తున్నాడు. మా పెద్దక్క ఇద్దరు పిల్లలతో మా దగ్గరే ఉంది. ఎలిమెంటరీ స్కూల్లో టీచర్ పనిచేస్తూ నన్ను చదివించింది. నాన్నగారు పోయిన ఈ ఐదేళ్ళకు నాకు డిగ్రీ వచ్చింది. టైపు షార్ట్‌హాండూ పాసయ్యాను. మీరు ఎక్కడైనా పని ఇప్పించగలిగితే సర్వదా కృతజ్ఞురాల్ని."

అతడు ఆలోచిస్తున్నాడు.

ఈమె కథ ఆతడి హృదయాన్ని కరిగించలేదు.

కాని ఆమె రూపం ఆతడి మతి పోగొడుతోంది ! ఆమె మాటలు వింటున్నాడో లేదో గాని ఆమెను గమనిస్తూ కూర్చున్నాడు.

కవిత ఇబ్బందిగా చూసింది. ఏమిటి! ఈతడి ధోరణి వింతగా ఉంది. మాట్లాడడేం ?

"సర్...ప్రయత్నించగలరా ?"

"ఏమిటి ?" ఆతడు ఆశ్చర్యంగా అడిగాడు

"అదే...నాకు పని...కావాలి."

"ఏం పని చేయగలరు ?"

"ఏ పని చెప్పినా చేస్తాను"

అతడు ఆలోచించాడు. తన కంపెనీ అంతటిని మనసులోనే ఓ మాటు చుట్ట బెట్టుకుని వచ్చాడు. ఎక్కడా ఖాళీ లేదు. ఆమెను అంత త్వరగా పంపటం కూడ తన కిష్టంలేదు.

"ఇక్కడ మీతండ్రిగారు ఉంటారన్న ఆశతో వచ్చాను" అంది నిరాశగా.


"ఎందుకని ? నాతో పని జరగదా ? నేను పని ఇవ్వలేనా ?"

"అహ..అదికాదు...మా తండ్రిగారు ఎంత నమ్మకంగా పనిచేసింది - ఇరవై ఐదేళ్ళక్రితం ఈ కంపెనీని స్థాపించి నప్పుడు మా నాన్నగారు ఎంతగా కంపెనీ ఉన్నతికోసం శ్రమించినదీ అదంతా మీ తండ్రిగారికి తెలుసు. ఈ పరిస్థితుల్లో నేను పనికోసం రాగానే వారిపైనున్న అభిమానంతో నాకు పని యివ్వటానికి, లేదా ఎక్కడైనా ఇప్పించ టానికి వెంటనే పూనుకునేవారు. వారిని ఒక్కసారి కలవటాని కవకాశ ముందాండీ ?"

అతడు నవ్వాడు. తమక్రింద పనిచేసేవారిమీద యజమానికి అంత అపేక్ష, అభిమానం ఉంటుందా !

"మీరు పాతకాలంనాటి మనుషులు. జీతానికి ఆయన పనిచేసేవారు. ఈయన జీతం ఇచ్చి పనిచేయించుకున్నారు. ఆయన పోయారు - గ్రాట్యుటీ అవీ కలిపి న్యాయంగా డబ్బు ముట్టజెప్పారు కదా ! ఇంక ఈ కంపెనీకి ఆయనకీ సంబంధం ఏముంది ? ఆయన కూతురికి పని యిచ్చితీరాలని ఎక్కడా లేదే –"

"మీరు చెప్పింది యదార్థమే. ఎక్కడా రాతలుగాని - అగ్రిమెంటు గాని లేదు. కానీ...సర్...విన్నారో




లేదో మీరు... సెంటిమెంట్స్ అనేవి హృదయాల్లో ఉంటాయి. వాటిని ఎవరు ఏ శక్తీ తుడిచివేయలేదు. మీ నాన్న గారికి కూడ అలాంటి సెంటిమెంట్ ఉండే తప్పక నన్ను రిక్తహస్తాలతో పంపరు. మీ రన్నట్లు నేను పాతకాలం మనిషిని. మీరే ఇప్పుడిప్పుడే కళ్ళు తెరుస్తున్నారీ అధునాతన యుగంలో."

ఆమె కంఠంలో ధ్వనించిన వ్యంగ్యాని కతని కనుబొమ్మలు ముడిపడినై. కసిగా చూచాడు.

ఏమిటీ ... ఈమెకు భయంలేదా? ఇంత ఫ్రీగా మాట్లాడుతోంది. తను ఈ కంపెనీ ఓనరని తెలిసే యింత ధైర్యంగా మాట్లాడితే...అనుకుని గబగబ ఏదో రాశాడు. బెల్ నొక్కాడు. ప్యూన్ రాగానే అన్నాడు "వీరిని ఇంటికి తీసుకుని వెళ్ళి ఒదలి రా. ఈ చీటి నాన్నగార్కి చూపించు." ఇక నీతో నాకు పనిలేదన్నట్టు ఒక ఫైల్ తెరిచాడు.

"వెళ్ళేక ముందు మీకు ఒకటి చూపాలి. ప్రస్తుతం యజమాని మీరే కనుక ఈ ఉత్తరం మీరే మొదట చూస్తే బావుంటుంది."

ప్యూన్ మెల్లగా వెళ్ళిపోయాడు. ఆమె సీల్ చేసిన కవర్ అందించింది.

అతడు ఆశ్చర్యంతో చూసాడు. కవర్ చాల పాతది. పాత వాసన వేస్తోంది. దానిమీది తేదీ చూచాడు 1955 వేసిఉంది. అటు యిటు త్రిప్పి ఆమెకేసి చూచాడు. కవిత కూడ ఆత్రంగా చూస్తోంది.

"ఇందులో ఏముందో మీకు తెలియదా?"

"లేదండి ఎప్పుడో దీన్ని నాన్న గారు అమ్మకిచ్చారట. అన్నయ్యకుగాని నాకుగాని ఉద్యోగం కావలసివచ్చి

నప్పుడు ఈ కవర్ మీకు చూపించమని కోరాడు. అన్నయ్యకి వాళ్ళ మామగారు పని ఇచ్చారు దీని అవసరం నాకు తగిలింది. దీనిలో ఏమున్నదో చూడాలని నాకు ఆత్రంగా ఉంది.

అతడు దాన్ని చేతితో తూచాడు. కొంపతీసి బాంబ్ గట్రా ఉండదు కదా!

అహ...అది బరువేలేదు. ఒకటి రెండు కాగితాలుండవచ్చు. చిదిరీ ఎన్వలప్ ఓపెనర్‌తో కవర్ చింపాడు.

రెండు వేరు వేరు కాగితా లున్నాయి.

ఒకటి చూసాడు. అది ఉత్తరం. రెండవది చూచాడు. అంతే —! అతడి కనుబొమ్మలు ఆశ్చర్యంతో ఒంగినై. దాన్ని పరీక్షగా చూస్తూ ఉంటే కవిత ఉత్సుకతతో వంగింది "ఏముంది సార్ ?"

ఆమెవైపు పరాకుగా చూసాడు. దాన్ని ఆమెకు కనబడేలా పట్టుకుని "ఇది ఏమిటో మీకు తెలుసునా ?"

కవిత నిరాశపడిపోయింది. అందులో ఉన్నది కేవలం ఒక డ్రాయింగ్..." "అదేదో ట్రేస్‌చేసిన డ్రాయింగ్... అని ఇంకా స్త ముందుకు వంగి పరీక్షించింది.

"ఆ...దీన్ని బ్లూ ప్రింట్ అంటారు" అన్నాడు. దాన్ని తనవైపు త్రిప్పుకున్నాడు

"సర్! ఉత్తరం చదవండి" అంటూ ఉంది. అతడు ఉత్తరం అందుకున్నాడు.

అది తన తండ్రిగార్ని సంబోధించి రాసిన లేఖ...

"ఈ బ్లూ ప్రింట్ మీరు అతి జాగ్రత్తగా ఫైల్‌లో పెట్టుకున్నారు ఈ మెషీన్‌కు సంబంధించిన విషయాల్ని - ఆ బ్లూ ప్రింట్‌ను ఎవరికైనా ఇస్తే నేను ఈ సరికి ఎంతో ఉన్నతస్థితిలో ఉండే వాడిని.

అప్పటికి కంపెనీ ఇంకా తప్పటడుగులు వేస్తోంది. మీరు అప్పుడే ఈ మెషీన్ ప్లాన్ వేశారు. అది తయారైనప్పుడు బాగా పనిచేసింది.

ఈ బ్లూ ప్రింట్‌ను అతి జాగ్రత్తగా మీరు ఇంట్లోఉన్న సేఫ్‌లో పెట్టుకునే వారు. కాని ఆ రోజు వర్క్‌షాప్‌కు తెచ్చారు. వర్కర్స్‌తో మీటింగ్ జరిపారు. ఆ తరువాత దానిని మీ రూంలో పెట్టి ఇంటికెళ్ళేటప్పుడు మర్చిపోయి వెళ్ళారు. పోనీ ఆఫీస్ సేఫ్‌లోనైన పెట్టలేదు. అప్పుడు నాకు నలభై ఒక్క సంవత్సరాలు. జీతం నూట ఎనభై రాల్లు రూపాయల ఆధారం తప్ప ఏమీలేని వాడిని. వృద్ధ తలిదండ్రులు వయసుతో వచ్చే చిన్న మూల్గులు వారికుండేవి. కాని నా భార్యకు మాత్రం ఏదో ఒక అనారోగ్యం ఉండేది. పెద్దవాడు తుంటరి వెధవ ఒక రౌడీ అనవచ్చు. తరువాత ఆడపిల్ల. నా జీతం ఎంత



పెరిగినా రెండువందలు కావచ్చును. కాని ఈ రెండువందల్లో మేము ఆరుగురం. ఇంకా పుట్టబోయే పిల్లలు - వారి పెళ్ళిళ్ళు ఇలాంటివన్నీ పెట్టుకుని జీవించగలమా ? ఎంతో కష్టంతో రోజులు గడుపుకొస్తున్నాను.

నా ఆర్థికపరిస్థితి ఇలా ఉండగా నా కళ్ళు ఈ అతి సీక్రెట్ ఫైల్‌మీద పడింది. దాన్ని చూడగానే గుర్తించాను. దాన్ని తీసుకుని అమ్ముకోవచ్చు - ఈ కష్టాలన్నీ తీరిపోతాయి!

కాని నా అంతరాత్మ ఒప్పుకోలేదు నేను అంత నీచానికి దిగజారలేదు.

అప్పుడు నాకొక ఆలోచన తట్టింది. నాకు ఇటువంటి అవకాశం లభించినప్పటికీ-దాన్ని వినియోగించుకోలేదని నమ్మకద్రోహిని కానని నిరూపించుకోటానికి గబగబ ఆ డ్రాయింగ్ ఎత్తాను దాన్ని తీసుకుని ఫైల్‌ను అక్కడే ఉంచి ఇంటికెళ్ళిపోయాను.

విజయశేఖరం

55

ఆర్థిక ఇబ్బందులలో ఉన్నా, ఉద్యోగాన్వేషణలో ఉన్నా ఇది పనికివస్తుంది.

కవిత చిన్నది. ఆమెకు ఇది చాలా లాభదాయకం కావచ్చును. అబ్బాయి 'ఇల్లరికం'లో అక్కడే ఉన్నాడు. పెద్దమ్మాయి భర్త పోయాడు హైయర్ గ్రేడ్ ట్రైనింగ్ అయింది.

కవిత చురుకైనది. ఆమెమీద

కుటుంబభారం పడితే...కనుక తమరు దయతో చిన్న ఉద్యోగమిచ్చి ఆదుకో గలరని ఆశిస్తున్నాను.

విజయశేఖరం

72

ఆఖరి మూడు పేరాలు వేరే ఇంకుతో ఉన్నాయి. రెండింటికి మధ్య పదిహేడు సంవత్సరాలు దొర్లిపోయాయి!

ఆ ఉత్తరాన్ని కవితకు చూపకుండా మడతపెట్టి రెండింటిని కవర్లో పెట్టాడు.

అతడి ముఖంలో మునుపున్న నిర్లక్ష్యభావం లేదు! కవిత ఆందోళనతో చూస్తోంది. కాని అతడు వెనక్కివాలి దీర్ఘాలోచనలో మునిగిపోయాడు.

పి.ఎ. లోపలికి రావటంతో అతడు కళ్ళు తెరచి అతనివద్దనున్న కాగితాలు అందుకున్నాడు

"ఈ పోస్ట్‌లో వచ్చిన లెటర్స్ సర్. ఓ మాటు చూడండి." రెండు చెక్కు లున్నాయి. ఒకటి ఏభైనాల్గువేలకు, మరొకటి ఇరవైనాల్గువేలకు. కొన్ని ఆర్డర్లున్నాయి. వాటన్నింటినీ చూసే ఓపిక తనకులేదు...

కాని ఆ రెండు చెక్కులు! ఆనాడే గాని ఆ విజయశేఖరం దీన్ని అమ్ముకుని ఉంటే తాము ఆనాడే దివాలాతీసి ఉండేవారు. తనకు తెలుసు ఇటువంటి వాటిల్లో ఎంత పోటీ ఉంటుందో! తన తండ్రి బ్రిలియంట్ బ్రెయిన్ బైల్డ్ యిది. ఎంతోమంది పి. ఎ లను ఇంజనీర్లను పట్టుకుని డబ్బు ఆశ చూపించి రహస్యాలకోసం ప్రాకులాడు తుంటారు. అందునా పేటెంట్ రిజిస్టరు చేయకముందు దీని కాపీ బైటికి వెళ్ళిపోతే స్వంతదారుడు చేసేదేంలేదు. ఆ రోజు నాన్న ఏదో ఎగ్జైట్‌మెంట్‌లో ఉండి ఉంటారు. అందుకనే అలా వదిలిపెట్టివెళ్ళారు. ఆ తరవాత కథ తండ్రి నడగాలి.

"నాకు అర్జంట్ పనివుంది-జవాబులు టైప్‌చేసి ఉంచండి. మిగిలినవి నేను చూసుకుంటాను." అతడు ఉత్తరాల కట్ట తీసుకుని ఓమాటు కవితకేసి వింతగాచూసి వెళ్ళిపోయాడు ... ఆ వెళ్ళిన పి. ఎ. వేపు తదేకంగా చూసాడు. స్వింగ్ డోర్ మూసుకుపోయింది. అతడు అక్కడలేడు. అయినా అతడు చూస్తూనే ఉన్నాడు.

"ఏమిటి ... మీ కలతకు కారణం ఏమిటి ? అలా చూస్తున్నారెందుకు ?"

అతడు ఆమెకేసి చూచాడు. "ఈ నా పి. ఎ. ఎలాంటివాడు-ఎంత నిజాయితీఉంది! ఎంత ప్రభుభక్తి ఉంది! అని ఆలోచిస్తున్నాను. మీరు సాయంత్రం నాలుగ్గంటలకు రండి. అప్పుడు ఏదైనా సహాయం చేయగలను." కవిత లేచింది. నమస్కరించింది, "ఆ కవరు ?" అంది నాన్చుతూ.

"అది మీకు అవసరంలేదు. ఇప్పటి నించి నా దగ్గర ఉంటుంది."

కవిత వెళ్ళిపోయింది. వెనుదిరిగి చూస్తుందని ఆశతో చూసాడు కాని ఆమె చూడలేదు.

వెంటనే ఇంటికెళ్ళాడు. కొడుకు ఆ వేళప్పుడు రావటం తల్లికి, తండ్రికి, తాతగార్కి ఆశ్చర్యం వేసింది. ఇద్దరు చెల్లెండ్రు ఒక తమ్ముడు ఉండే వాళ్ళు కూడా అన్నచుట్టూ తాఉండి "ఏం జరిగిం" దని గోలచేసేవారే. తండ్రిని లోపలికి తీసుకెళ్ళి ఆ కవరు అందింది కూర్చున్నాడు.

ఆయన చదువుతున్నాడు.అందులోని విషయం ఎంత సీరియసో గుర్తుగా అతడి చేతులు కంపిస్తున్నాయి. ఆ తరువాత ఆ బ్లూ ప్రింట్ డ్రాయింగ్ కేసి తదేకంగా చూసాడు.

"ఇది...ఇది నీకెలా వచ్చింది ?"

"అందులో రాసినట్లు కవిత వచ్చింది. ఉద్యోగంకోసం..."

"ఓ...ఇప్పుడెక్కడ ఉంది ?"

చెప్పాడు.

"అజయ్! నా సలహాకోసం వచ్చావా? దీని విలువ నీకు తెలీదూ ?" అన్నాడు మందలింపుగా.

"నాన్నా-మీ సలహాకోసం రాలేదు... ఆ తరవాత జరిగిన కథ విందామని వచ్చాను. మీరు వెళ్ళినప్పుడు ఆ ఫైల్ ఎక్కడుంది ? ఏం చేశారు ?"

"నాకు కొన్ని గంటల తర్వాత జ్ఞాపకం వచ్చింది. శేఖరంగారు పని సక్రమంగా బాధ్యతాయుతంగ చేస్తున్నా అతడిలో ఉత్సాహం ఉండేదికాదు. మౌనంగా తనపని చేసుకుపోయేవారు. ఒక విషయాన్ని గూర్చి తర్కించి దానికి మార్పులు చేర్పులుచేసి అందరు ఓ.కె. అన్న తరవాత మెల్లగాలేచి దాని లోని లోపాన్ని సావకాశంగా చెప్పేవారు. అది మా కెవ్వరికీ ముఖ్యంగా నాకు నచ్చేదికాదు. ఆ అనుమానం మాకు రాదు. అతడికి వస్తుంది. ఆ కోణంలో ఆలోచించి క్రొత్త తీర్మానం చేయవలసి వచ్చేది. ఇదంతా గుర్తుకువచ్చి శేఖరం గంభీరత చాటున తన అసలు గుణం దాచుకుంటున్నాడేమో - ఆ గంభీరత అన్న పరదా తొలగిస్తే దాని చాటున ఉండేది మామూలు - లౌక్యానికి లొంగి పోయే మనిషి అనుకుని గబగబ వర్క్ షాప్ కెళ్ళాను. అప్పుడది ఆ సందులో ఉండేది. ఈ బిల్డింగు కట్టలేదు. వెళ్ళి తలుపు తీసి చూసాను. ఫైల్ అక్కడే ఉంది. పేపర్స్ అన్నీ ఉన్నాయి. వెంటనే ఇంటికి తెచ్చాను. మరుసటిరోజు ఫైల్ సంగతి ఎత్తి ఎందుకంత అజా గ్రత్తగా పెట్టారని అడుగుతాడేమోనని చూసాను. కాని అతడు మామూలుగా ప్రవర్తించాడు.

"ఆ తరువాత జీతం ఎక్కించమని అడిగాడా ?"

"లేదు ... అందరు అడగటం ప్రారంభిస్తారని-అదొక దురలవాటు అవుతుందని చిన్న ఉపన్యాసమిచ్చాను"

"ఏంచేశాడు మరి ?"

"ఏమో...అందరు ఏంచేస్తారు? ఏదో అమ్ముకుని ఉంటాడు"

"పాపం."

"ఔను. పాపం...ఇప్పుడు పిలవు తున్నాము."

"ఒక్కసారైనా మీకు హింట్ ఇచ్చాడా ?"

"లేదు, అందుకే ఉత్తరాన్ని చూడ గానే ఆశ్చర్యం వేసింది. నాకు అను మానమే లేకపోయింది."

"ఇప్పటి నా పి.ఎ. ఎలాంటివాడు?"

"మంచివాడనే అనుకుందాం. మనిషి మీద నమ్మకముండాలి బాబూ."

"కవితను సాయంత్రం రమ్మన్నాను."

"మంచిపనిలో ప్రవేశపెట్టాలి. ఏం చెయ్యదలిచావు ?"

అతడు మాట్లాడలేదు ఒక్క క్షణం తండ్రికేసి చూచి లేచి వెళ్ళిపోయాడు. కొంతసేపటికి కారు వెళ్ళిపోతున్న శబ్ద మయింది.

"ఏమిటి బాబూ" అని ముసలాయన అడిగాడు.

అతడు మాట్లాడలేదు. ఆ రెండు కాగితాలు అందించాడు.

అవి చదివి చాలా విస్తుపోయాడు

"ఆ కాలం మనిషి కాబట్టి న్యాయానికి కట్టుబడి అంత గొప్పగా ప్రవర్తిం చాడు. పాపం ఆ అమ్మాయికి ఏదైనా దారి చూపించండి."

"ఆ...అందుకే వెళ్ళాడు" చాలా సేపు ఇద్దరూ మౌనంగా కూర్చుండి పోయారు

అజయ్ వెళ్ళి రూంలో కూర్చున్నాడు. ఏంచెయ్యాలో ఆలోచిస్తున్నాడు. పి.ఎ. రాసిన ఉత్తరాలమీద సంతకాలకోసం వచ్చాడు.

"అన్నీ ఇక్కడ పెట్టండి...మీకు విజయశేఖరంగారు తెలుసునా ?"

"నేను పనిలో జేరిన రెండేళ్ళకు వారు పోయారండి. బాగా తెలుసు."

"వారి కూతురు పనికోసం వచ్చింది. వాళ్ళ నాన్నగారు ఇరవై సంవత్సరాలు పనిచేశారు. ఆమెకు తప్పక ఏదో పని కల్పించాలని సంకల్పించాము. ఆమెకు మీరు మీ పని విధానం అంతా నేర్పిం చండి. తరవాత చూసుకుందాం."

"అలాగే సర్" అని వెళ్ళిపోయాడు.

సరిగ్గా నాలుగ్గంటలు-గడియారంలో చైమ్స్ వినిపిస్తున్నాయి. ప్యూన్ వచ్చి కవిత వచ్చిందని చెప్పాడు. ఆ మాట వింటూనే అజయ్‌కు హుషారు వచ్చింది.

"రమ్మని చెప్పు."

కవిత లోపలికొచ్చి నమస్కరించి నుంచుంది.

వస్త్రధారణలోగాని-ముడిలోగాని ఏ మార్పులేదు. కాని ముఖం బాగా అలసి ఉంది.

"సరిగ్గా టైంకు వచ్చారు."

"ఔను సర్. టైం ఈజ్ ప్రెషస్

అన్నారు కదా! నా కంటే దాని విలువ ఇంకెవరికి తెలుసు ... మీరు నాల్గు గంటలకు రమ్మన్నారు."

"కూర్చోండి...ప్రస్తుతం ఇక్కడ ఖాళీలులేవు..." ఆ మాట వినటంతో కవిత ముఖం వివర్ణమైంది.

"ఆగండి...మీకోసం ఓ చిన్నపని కల్పించాము. మా పి. ఎ. దగ్గర పని నేర్చుకోండి...ఆ తరువాత ఆతణ్ణి వేరే దగ్గరకు వేస్తాము."

కవిత ముఖం ఒక్కసారి ఆనందంతో వెలిగిపోయింది. ఆమె హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. ఆమె కళ్ళ లోని తడినిచూచి అజయ్ కళ్ళు తప్పించేశాడు.

"మీకు నా కృతజ్ఞతలు."

"మీ నాన్నగారిలా నాకు మీరు పి. ఎ.గా ఉండి మన కంపెనీ ఉన్నతికి తోడ్పడాలి." అని ఆమె తండ్రి రాసిన ఉత్తరంలోని విషయాల్ని కవితకు చెప్పాడు.

కవిత ఆశ్చర్యంతో వింది. ఆ తర్వాత అంది "నాన్నగారు అలా చేశారంటే నాకు ఆశ్చర్యంగాలేదు. ఆయనది గొప్ప వ్యక్తిత్వం. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వచ్చినా ధైర్యంగా ఎదుర్కొన్నారు వారికున్న ధీరత, నిబ్బరం అంకుటిత దీక్ష మా కెవ్వరికీ రాలేదు. న్యాయానికి కట్టుబడి ఉండటమే జీవితాశయంలా ఉండేది. అన్నయ్య వలన ఎన్నో సమస్యలు, కలతలు వచ్చేవి. కేవలం ఒక్క అన్నయ్య విషయంలోనే వారు ఓడిపోయారు. అక్కయ్య మా నాన్నగారిలాంటిది.." ఉద్రేకంతో చెప్పుకుంటూపోతూ ఆయన వేపు చూసింది.

అజయ్ ఆమెమాటలు వింటున్నాడో లేదో, కాని బహు దీక్షగా ఆమెను గమనిస్తున్నాడు.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది. తను అతనిక్రింద పనిచేయాలని ... "సారీ సర్..." అంది సిగ్గుపడి తల వంచుకుంది.

"మీకు జీతం ఎంత ఇస్తే బావుంటుంది ?"

"నన్ను అడుగుతున్నారా ? నేను ఎక్కువ అడిగితే !"

"అడగరు-మీరు విజయశేఖరంగారి కూతురుకదా!"

అప్పటికి నవ్వింది కవిత.

ఆ నవ్వు! చల్లగా-హాయిగా ఉంది. ఆమె ముఖంలోని అలసటను తుడిచి వేస్తూ ప్రశాంతత నిచ్చింది.

వంకలేని పలువరస తళుక్కుమంది. మనసు నిర్మలంగా ఉంటేనే అంత స్వచ్ఛంగా నవ్వగలరేమో!

"మీరు ముందరే జాగ్రత్తపడు తున్నారు. ఇంకా పనినేర్చుకునే స్టేజిలో ఉన్నాను. మా ఇల్లు చాలా దూరం లేదు నూటఏభై ఇస్తే చాలు సర్."

"ఓ. కె. రేపటినించి రండి."

కవిత నమస్కరించి వెళ్ళిపోయింది. ఆమె పాదాలు నేలను తాకినట్లే లేదు. హృదయం పూవులా తేలిపోతోంది.

నాన్నగారు పోయిన తరువాత ఇంత సంతోషంగా ఏనాడూ ఫీలవలేదు ఇదంతా వారి చలువ.

అజయ్ అలా వెనక్కివాలి కళ్ళు మూసుకున్నాడు.

ఎడతెరిపిలేకుండా సతమతమయ్యే పనుల్లో అజయ్‌కి తీరిక దొరికేదికాదు. కాని ఈ రోజు తీరికగా ఉన్నట్లు ఫీలవుతున్నాడు. సెంటిమెంట్స్ మాట అలా ఉంచి-ఈ రోజు చాల ఎమోషనల్‌గా ఉన్నాడు. అసంపూర్తిగా ఉన్నట్లున్న భావన ఈనాడు లేదు. తన అన్వేషణ పూర్తయినట్లుగా ఉంది...

ఒకరోజు తన హృదయం విప్పి ఆమె ఎదుట ఉంచాలి.

ఎప్పుడు ? ఎలా ?

అందమైన ఊహల్లో తేలిపోతుంది మనసు.

అంతలోనే తేలు కుట్టినట్లు లేచి కూర్చున్నాడు.

ఆమెను రేపటినించి పనిలోకి వచ్చి పని నేర్చుకోమన్నాడు. ఒకనాడు వారికి యజమానురాలు అవుతుంది.

ఇదెంతవరకు సబబుగా ఉంటుంది ? వారి దృష్టిలో ఆమెకు ఎటువంటి స్థానం ఉంటుంది ?


ఆ రాత్రి చాలాసేపు ఆలోచించాడు. కవితను అందరూ చూస్తారు. ఆమెలోని అందాన్ని-ఆమె ప్రతి కదలికను పిచ్చిగా చూస్తారు. వారి సంభాషణల్లో ముఖ్యాంశమైపోతుంది.ఆమె అవివాహిత-తమలో ఒకరై-కనుక ఆమెను పొందటం సులభం. పెళ్ళి కానివాడు ఆమెను పెళ్ళాడాలని చూస్తాడు. పెళ్ళయిన వాడు ఆబగా వెర్రిగా చూస్తాడు. ఉహూ ...కవితను అందరి ఎదుట అలా వదల్లేడు...ఆమెను పెరేడ్ చేయించ లేడు. ఏం చెయ్యాలి ? రేపే ఆమెకు తన ప్రేమను తెలియజెయ్యాలి ! పోనీ ఆమెను తను చేసుకోబోతున్నట్లు ప్యూన్ రంగయ్యకు చెబితే చాలు. ఆలిండియా రేడియోలా ప్రచారం చేయగలడు-

కాని...

ఆమెకు తెలియకుండా తాను ఈ మార్గం అనుసరించటం అవివేకమే అవుతుంది దాన్ని అహంకారం క్రింద జమకట్టి తన అభిప్రాయం తెలుసు కోనందుకు బాధపడి తనను క్షమించక పోతే ! అమ్మో-ఆ శిక్ష తను భరించ లేడు. పోనీ-ఆమెకు ఏ బావో-! (ఈ బావలకున్న రైట్స్‌ను తీసెయ్యాలి.)లేక ఎవరినైన ప్రేమించిందేమో-లేక పెళ్ళి కుదిరిపోయిందేమో ! ఎన్ని లేవు ?

అజయ్ అశాంతితో గడిపాడు.

ఎటూ తేల్చుకోలేక నెలరోజులు గడిపాడు. అతడి పరాకు-కోపం-విసుగు-




అసహనం చూచి ఇంట్లో మిగతా ఐదుగురు ఆశ్చర్యపోయారు. ఒక్క తాతగారే పసికట్టి నిలేశారు.

ఉన్నమాట చెప్పక తప్పింది కాదు. "ఇవ్వాళ జీతం ఇస్తావు కదా! అప్పుడు చెప్పెయ్" అంటూ సలహా యిచ్చారు.

తెల్లచీరలో నీటుగా ముస్తాబై వచ్చింది. ప్రతిరోజూ మాదిరిగానే నమస్కరించి పాడ్ పెన్సిల్ సిద్ధం చేసుకుని ఆతడు ఏం చెబుతాడోనని ఎదురుచూస్తోంది.

"ఏమిటో పాపం...బాస్ రోజు రోజుకు తీసిపోతున్నారు" అనుకుంది మనసులో.

"రాసుకోండి"–అన్నాడు. రెండు చేతుల వ్రేళ్ల జుట్టులోనికి పోనిచ్చాడు...

"మీరు పి. ఎ. కదా. నా పర్సనల్ లెటర్స్ కూడా రాయొచ్చనుకుంటాను ?"

"ఎస్సర్" అంది రకీమని.

"అయితే కానివ్వండి."

"డియర్ డాక్టర్ !

నాకు రాత్రుళ్లు నిద్రపట్టటంలేదు. ఒక్కోసారి గుండెలోపోటు వస్తోంది. కొన్నిసార్లు ఆగిపోయినంత అవుతుంది. ఏదో భావన నా హృదయాన్ని నలిపివేస్తోంది. ఆ తోటికి తాళలేక నిట్టూర్పులతోనే కాలం గడుపుతున్నాను. విసుగు, కోపం, అసహనంతో అలసిపోతున్నాను. ఏ పని చేసినా మనసు దానిపై లగ్నం కావటం లేదు ఇక దేనిమీద లగ్నం అవుతోంది అని ప్రశ్నిస్తారా ? మీరే చెప్పాలి. ఈ వ్యాధి ఎప్పటినించి ప్రారంభమైనదంటే..." అజయ్ ఆపుజేసి టేబిల్ మీద చేతులుంచి ఆత్రంగా ఆమెకేసి చూసాడు. క్రింది పెదవిని పంటితో నొక్కిపట్టి ఎదురుచూస్తోంది. వాలిన ఆమె కనురెప్పల వొంపును–ఆ వొంపును

ప్రస్ఫుటం చేస్తున్న కనుబొమల్ని చూస్తూ తాను మరచిపోయాడు.

"ఎస్-సర్" అని కళ్ళెత్తి చూచింది. అతడు తనదెస అంత దీక్షగా చూడటం గమనించి ముఖం బాగా దించేసుకుంది.

"ఓ...ఎస్...ఏ మన్నాను? ఆ వ్యాధి ఎప్పటినించి అంటే కవిత పనిలో చేరిన..."

కవిత చటుక్కున తలెత్తి చూచింది. ఆ చూపుల్లోని కృత్రిమ మందలింపును గ్రహించి గబగబ అన్నాడు "ఆ రోజు కవితను చూచిన క్షణం నించి. కవితా... ప్లీజ్... ఈ జబ్బు నయం చేయలేరా?"

అతడి కళ్ళలో ఆరాధన, ఆత్రత, వేడికోలు-

కవిత పాడ్‌ను, పెన్సిల్‌ను అక్కడ పెట్టి లేచింది.

"నా రాకతో మీకి వ్యాధి వచ్చింది. నా పోకతో..." అని కుర్చీ జరిపి రెండడుగులు వేసిందో లేదో, అజయ్ గాభరాగా "కవితా" అన్నాడు.

ఆమె ఆగింది. ఆ ముఖంలోని ప్రసన్నమైన చిరునవ్వును చూచి స్థాయి పడి ఆత్రంగా అన్నాడు "నాకు జవాబు కావాలి. మిమ్మల్ని ప్రాణాధికంగా ప్రేమిస్తున్నాను"

"కవిత మెల్లగా వచ్చి కూర్చుంది. ఆమె ముఖంలో దైన్యత!

"ఇది మీకు మంచిదికాదు. నేను పేదరాల్ని. మాది అతి మామూలు కుటుంబం. మీరు నా యజమాని. ఎంతో ఉన్నత హృదయంతో నాకు పని ఇచ్చారు. ఈ అవకాశాన్ని పురస్కరించుకుని నేను మీ చేరువకు రావాలను కోవటంలేదు. నా పరిధిలో నేను ఉండటం మన ఇరువురికి శ్రేయస్కరం."

"నేనంటే మీకేవిధమైన అభిప్రాయం లేదా? ఐ మీన్, నా ప్రేమను తృణీకరించ గల్గేటంత కఠినహృదయులా మీరు?" బాధగా అడిగాడు.

"మీరంటే గౌరవాభిమానాలున్నాయి. మీ సహృదయతకు మేమందరం కృతజ్ఞులం. మా అమ్మకు, అక్కకు నా అవసరం ఎంతేనా ఉంది. మీ ఇంట్లో దీన్ని హర్షించరు, కనుక."

"అవన్నీ స్వల్ప విషయాలు. మా ఇంట్లో అలాంటి అడ్డంకులు లేవు. నేను, చెల్లి తమ్ముడు ఒక్కటైతే వాళ్ళ ముగ్గుర్నీ మావైపుకు త్రిప్పగలము. తాతగారే నాకీ సలహా యిచ్చారు. ప్రతి నెల మీ అమ్మగారికి కొంత డబ్బు అందేలా చేసే బాధ్యత నాది... ఇక మీ అభ్యంతరం ఏమిటి?"

కవిత మాట్లాడలేదు పాడ్‌మీద ఏదో గీస్తూంది.

అజయ్‌కు భయంవేసింది ఎందుకు సందేహిస్తోంది?

"కవితా... మీరు ఎవరినైన

ప్రేమించారా? లేక ఎవరితోనైనా పెళ్ళి కుదిరిందా? మొదటిదైతే నేనేం చెయ్య లేను- కాని రెండోదైతే దాన్ని కాన్సిల్ చేయొచ్చు" ఆశతో చూశాడు.

ఆమె గీయటం ఆపుచేయలేదు, కాని మెల్లగా అంది.

'ఐయామ్ సారీ సర్... నేను ఒకర్ని ప్రేమించాను."

ఆ మాట వినటం తడవు తన క్రింద భూమి లేనట్లు తాను ఎక్కడికో— ఎక్కడికో అధఃపాతాళంలోకి వెళ్ళిపోతున్నట్టు ఫీలయి నిలద్రొక్కుకోటానికి కుర్చీ చేతిని గట్టిగా పట్టుకున్నాడు ఆమెవేపు నిరాశగా చూస్తున్నాడు.

"అందని ద్రాక్షపళ్లు పుల్లన కదా! అందుకని ఆ వ్యక్తిని ప్రేమించినప్పటికి ఆ విషయం అతనికి తెలియకుండా జాగ్రత్తపడ్డాను ఆ ఆశలు వదలుకుని ఓ విధమైన యాంత్రికజీవితం గడుపుతున్నాను."

''అందని ద్రాక్షపండ్లు పుల్లన అనుకుని వదలుకుంటారా? ఎందుకందదు? డబ్బు అవసరమా? చెప్పండి. నాలా మీరు బాధపడకూడదు. ఆశించినది పొందకపోవటంలోని బాధ నాకు తెలుసు. సరే... ప్రస్తుతానికి ఏంలేదు. వెళ్లండి. తరువాత చెబుతారు కదూ?"

కవిత లేచింది. పుస్తకం, పెన్సిల్ తీసుకుంది.

తలుపుమీద చేయివేసి క్షణం తటపటాయించింది. తరువాత మెల్లగా అంది "ఆ అందని ద్రాక్షపండు అజయ్‌కుమార్."

అజయ్ ఒక్క అంగలో ఆమెను సమీపించాలనుకున్నాడుగాని కవిత తలుపు తీసుకుని వెళ్ళిపోయింది.

తను కూడ వెళ్ళాలనుకున్నాడు. కాని కారిడార్‌లో ఎవరైనా ఎదురుపడి తన ఉద్రేకాన్ని చూచి నవ్వుకోవచ్చు. తలుపు దగ్గరే చాలాసేపు నుంచున్నాడు. అతడు వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

గోడమీది పెయింటింగ్ అతడి దృష్టి నాకర్షించింది...అతడి ఊహకందని భావమేలేదు!

"మూలిన్ రూ"లో ఆ రంగుల గొడుగు క్రింద-కవితను తాను పొదివి పట్టుకుని ఒక చేత్తో గొడుగుపట్టుకుని ఆ నీళ్ళలో నడుస్తుంటే...కవిత కుచ్చిళ్ళు ఎత్తి పట్టుకుని నవ్వుతూ ఏదో చెబుతుంటే...ఆ సన్నటి నీటి తుంపరలు పన్నీటి జల్లులా ఆమె ముఖారవిందాన్ని తాకుతుంటే—ఆ మృదువైన చల్లటి చెక్కిలిని ...

